క్లుప్తంగా

కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా రవీందర్‌యాదవ్



నియామకపత్రం అందజేస్తున్న చల్లా నర్సింహారెడ్డి

తలకొండపల్లి: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా రవీందర్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తన నివాసంలో ఆయనకు నియామకపత్రం అందజేశారు. గతంలో కాంగ్రెస్ ఓబీసీ మండల చైర్మన్‌గా, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శిగా పార్టీ బలోపేతానికి రవీందర్‌యాదవ్ ఎనలేని కృషి చేశాడని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. అనంతరం రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ.. పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిదన్నారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన వంశీచంద్‌రెడ్డి, టీపీసీసీ కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములు, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్యగుప్తా, సర్పంచ్ శ్రీశైలం, అసెంబ్లీ సోషల్ మీడియా ఇన్‌చార్జి అజీం, కిసాన్‌సెల్ మండలాధ్యక్షుడు విష్ణుగౌడ్, ఆరీఫ్, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



బాలాపూర్ తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

బడంగ్‌పేట్: బాలాపూర్ మండల తహసీల్దార్ జనార్దన్‌రావును రేషన్ డీలర్ల మండల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక అభయాంజనేస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తహసీల్దార్‌ను శాలువలతో సన్మానించారు. అనంతరం తహసీల్దార్ జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు టేకుల శౌధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దండు గణేశ్ ముదిరాజ్, సురేష్‌గుప్తా, కృష్ణగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్య, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి సన్మానం



జనార్దన్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామంలోని న్యూసాదత్ నగర్‌కు సీసీ రోడ్డు మంజూరు చేయించడంలో ప్రత్యేక చొరవ తీసుకున్నందుకు మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు యంజాల జనార్దన్‌ను శుక్రవారం స్థానికులు ఘనంగా సన్మా నించారు. కాలనీకి సీసీ రోడ్డు లేని కారణంగా ప్రజ ల ఇబ్బందుల విషయమై జనార్దన్ మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేశారు. ఆయన్ను సన్మానించిన వారిలో సయీద్ పటేల్, మతీన్ పటేల్, అబ్బాస్, ఇద్రీస్, మెహరాజ్ పటేల్, నగేష్, జీషాన్, ఆమీర్ పాల్గొన్నారు.

పద్మశాలి ఆత్మగౌరవ భవనం

భూమిపూజకు తరలిరండి

చైతన్యపురి: పద్మశాలి ఆత్మగౌరవ భవనం భూమి పూజకు కుల బాంధవులంతా తరలిరావాలని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యుడు రాపోలు సుధాకర్ ఒక ప్రకటనలో కోరారు. కోకాపేటలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు భవన శంకుస్థాపన జరుగుతుందని తెలిపారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు హాజరవుతారని ఆయన అన్నారు. పద్మశాలి నాయకులు, ప్రజాప్రతినిధులు, చేనేత సహకార సంఘాల బాధ్యులు పెద్ద ఎత్తున పాల్గొని ఐక్యతను చాటాలని కోరారు.

ఘనంగా సంత్ సేవాలాల్ భోగ్‌బండార్

ఆమనగల్లు: మండల కేంద్రంలోని సేవాలాల్ మహారాజ్ గుట్టపై గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ మహారాజ్ భోగ్ బండార్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ అనితానాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధనాయక్, గిరిజన నాయకులు పాండునాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ మహారాజ్‌కు గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాండునాయక్, పూజారి హప్బాభావోజీ, సర్పంచ్ సోనుశ్రీనునాయక్, ఎంపీటీసీ సభ్యురాలు సరితానాయక్, ఉప సర్పంచ్ ప్రశాంత్, నాయకులు దశరథ్‌నాయక్, రవీందర్‌నాయక్, సురేశ్, నానునాయక్, రాములునాయక్, శంకర్‌నాయక్, రాంజనాయక్, రాములు, లక్ష్మణ్, తావు పాల్గొన్నారు.



నడిరోడ్డులో ఏడాదిగా ఇదే దుస్థితి



గౌతంనగర్‌లో దేవి మెడికల్ హాల్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్



గౌతంనగర్ రోడ్ నం-3లో మూతలేని మ్యాన్‌హోల్

ఎన్నాళ్లిలా..?

- ప్రధాన రోడ్లపై పగిలిన మ్యాన్‌హోళ్లు
- మరమ్మతులపై అధికారుల నిర్లక్ష్యం
- బారికేడ్లు పెట్టి చేతులు దులుపుకుంటున్న వైనం
- ప్రమాదాల బారిన పాదచారులు, ద్విచక్రవాహనదారులు

చైతన్యపురి: మ్యాన్‌హోళ్లు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి.. మ్యాన్‌హోళ్ల నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే అవి పగిలిపోయి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గడ్డిఅన్నారం డివిజన్ గౌతంనగర్ కాలనీలో రహదారుల మధ్యలో ఏర్పాటు చేసిన మ్యాన్‌హోళ్లు, వాటి కవర్లు పాడైపోయి పూర్తిగా లోనికి కుంగిపోయి దర్శనమిస్తున్నాయి. ఏడాది కాలంగా ఇదే పరిస్థితి ఉన్నా .. జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే కానీ అధికారులు పట్టించుకోరా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాడైపోయిన మ్యాన్‌హోళ్లను పునర్నిర్మించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

- గౌతంనగర్ కాలనీలోని కొన్ని మ్యాన్‌హోళ్ల కవర్లు ధ్వంసం కావడంతో నోరుతెరుచుకుని ప్రమాదకరంగా మారాయి.
- కాలనీకి వచ్చే ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్ పాడై ఏడాది దాటిందని, అధికారులు మరమ్మతు చేయకుండా చుట్టూ బారికేడ్లు పెట్టి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు తెలిపారు.
- పట్టణ ప్రగతి కార్యక్రమంలో మ్యాన్‌హోళ్ల సమస్యపై ఎమ్మెల్యే, జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండాపోయిందంటున్నారు.
- పగిలిన మ్యాన్‌హోళ్లపై ప్రయాణిస్తూ ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని కాలనీవాసులు తెలిపారు.
- కాలనీలోని ఓ మ్యాన్‌హోల్‌లో ఇటీవల ఆటో పడి ప్రమాదానికి గురైందని వారు చెప్పారు.
- వర్షం వస్తే రహదారిపై వరద నీరు చేరి మ్యాన్‌హోల్ గుంత ఎక్కడ ఉందో తెలియక వాహనదారులు, పాదచారులు అదుపుతప్పి పడిపోతున్నారని కాలనీవాసులు పేర్కొన్నారు.
- రహదారి ఎత్తు, పల్లాలు ఉండటం, వర్షం పడ్డప్పుడు నీరు వెళ్లే మార్గం లేక అలాగే నిలిచి రోడ్లు కూడా పాడైపోతున్నాయని చెబుతున్నారు.
- కార్పొరేటర్, అధికారులకు పలు పర్యాయాలు వినతిపత్రం సమర్పించినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.
- పగిలిన, కృంగిన వాటి స్థానంలో వచ్చే వర్షాకాలంలోపు కొత్త మ్యాన్‌హోళ్లు నిర్మించి, వాటిపై కవర్లు వేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరా?



కాలనీలో మ్యాన్‌హోల్ పాడైందని ఏడాది క్రితమే అధికారులకు ఫిర్యాదు చేశాం. పట్టణ ప్రగతి కార్యక్రమంలో వినతి పత్రం ఇస్తే త్వరలో సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. అయినా పట్టించుకోవటం లేదు. ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోళ్లకు మరమ్మతు చేయాలంటే సంవత్సరాలు పడుతుందా..? ముక్కుపిండి పన్నులు వసూలు చేసే అధికారులకు ప్రజా సమస్యలు పట్టవా. ప్రమాదాలు జరిగి ఎవరైనా ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యత వహిస్తారు. ఇప్పటికై నా సమస్య పరిష్కరించాలని కోరుతున్నాం

–క్షేత్రం మధుసూదన్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, గౌతంనగర్

అక్రమ అరెస్టులు సరికాదు



కందుకూరులో పీఎస్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, మహిళలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

కందుకూరు: ఇళ్ల స్థలాల కోసం నిరీక్షిస్తున్న పేదలను అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్యని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ విమర్శించారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 788లో ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేస్తున్న సీపీఎం నాయకులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. సీపీఎం మండల కార్యదర్శి బుడ్డీరవు శ్రీనివాస్‌తో పాటు గుడిసెల పోరాట సంఘం అధ్యక్షుడు రాయికంటి శేఖర్, నాయకులు గాదె సత్తయ్య, గాదె కుమార్‌తో పాటు పలువురు మహిళలను అరెస్టు చేశారు. దీంతో సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్ వెస్లీ, జిల్లా కమిటీ సభ్యుడు దుబ్బాక రాంచందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి పీఎస్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో సమావేశాలు పెట్టుకోవడానికి పోలీసులు అనుమతించకపోవడం దారుణమన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ.కుమార్, బి.బాల్‌రాజు, ఎ.నర్సింహ, అరుణ, అనిత పాల్గొన్నారు.

డ్రెయిన్ పనులు త్వరగా పూర్తి చేయండి



డ్రెయిన్ పనుల ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: సరూర్‌నగర్ చెరువు లోతట్టు కాలనీల ముంపు నివారణకు చేపట్టిన డ్రెయిన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శంకీశ్వర బజార్ చౌరస్తా, శివగంగా థియేటర్ ప్రాంతాల్లో జరుగుతున్న డ్రెయిన్‌పనులను ఎస్‌ఎన్‌డీపీ, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సింగరేణి కాలనీ మీదుగా వచ్చే వరద నీరు శంకీశ్వరబాజార్, శివగంగా థియేటర్ ప్రాంతాల్లో రహదారులపై ప్రవహిస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందుకే సమస్య పరిష్కారానికి డ్రెయిన్ నిర్మాణం చేపట్టామన్నారు. సరూర్‌నగర్ లోతట్టు కాలనీలు కోదండరాం కాలనీ, రెడ్డి బ్రదర్స్ గల్లీ ప్రాంతంల్లో బాక్స్ డ్రెయిన్ వల్ల వరద ముంపు కొంత మేర నివారించవచ్చన్నారు. పనులు పూర్తయితే శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ చీఫ్ ఇంజినీర్ కిషన్, జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ జియావుద్దీన్, ఈస్ట్ జోనల్ కమిషనర్ పంకజ, అధికారులు భాస్కర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి స్థానిక నేతలు భవానీ ప్రవీణ్‌కుమార్, శ్రీశైలంయాదవ్, రమణారెడ్డి, శివకుమార్, విక్కీ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మురుగు ప్రవాహం



సుష్మా చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై పారుతున్న మురుగు

ఇబ్బంది పడుతున్న వాహనదారులు

వనస్థలిపురం: విజయవాడ జాతీయ రహదారిపై వనస్థలిపురం సుష్మా చౌరస్తా సమీపంలో చాలా రోజులుగా మ్యాన్‌హోళ్ల నుంచి మురుగునీరు పొంగి పొర్లుతూ రోడ్డుపై పారుతోంది. దీంతో ఆ దారిన వెళ్తున్న వాహనదారులు మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై మురుగు ప్రవాహంతో దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు. ఈ సమస్య చాలా కాలంగా ఉన్నా.. పరిష్కారానికి అధికారులు పూనుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయిన్లకు మరమ్మతులు చేపట్టి మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

ఓటరు లిస్ట్ తయారీపై అఖిలపక్ష సమావేశం

ఓటర్‌లిస్ట్‌పై అఖిలపక్షం సమావేశం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం కందుకూరు ఆర్డీఓ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఓటరులిస్ట్, కొత్త ఓటర్ల నమోదుపై అఖిలపక్షం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, ఇతర పార్టీల తరుపున రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాలను ఓటర్లకు దగ్గరగా ఏర్పాటు చేయాలని కొంతమంది, బూత్ లెవెల్ అధికారులకు అలవెన్సులను చెల్లించాలని మరికొందరూ..దొంగ ఓట్లను తొలగించాలని, అలాగే ఓటర్లకు ఆధార్ కార్డు లింక్‌ను అనుసంధానం చేయాలని, గ్రామాలల్లో ప్లాట్ నెంబర్లపైన కాకుండా డోర్ నెంబర్లపైన ఓట్లు రాయాలని, కాలనీల పేర్లుకూడా ఓటరులిస్టులో నమోదు చేయాలని పలువురు అభిప్రాయాలను వెల్లడించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటు హక్కును నచ్చిన వారికి వేసే హక్కును ధైర్యాన్ని, రక్షణను కల్పించే బాధ్యత ఎన్నికల అధికారులు, స్థానిక పోలీసులు, కార్పొరేషన్ అధికారులు నిర్వహించాల ని ఎవరికి కొమ్ముకాయవద్దని పలువురు సూటి గా అభిప్రాయాలను వెల్లడించారు. ప్రశాంతంగా తమ అభిప్రాయాలను వెల్లడించిన నాయకులకు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

వరద కాలువ నిర్మాణానికి సహకరిస్తాం..

- 'సాక్షి' కథనానికి స్పందన

వనస్థలిపురం: 'పూర్తికాని వరద కాలువ పనులు... ముంచుకొస్తున్న ముంపు ముప్పు', శారదానగర్ కాలనీ సమీపంలో వరద కాలువ నిర్మాణానికి స్థలం ఇచ్చేందుకు సహకరించని స్థల యజమానులు శీర్షికన శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి స్థల యజమానులు స్పందించారు. స్థల యజమానుల్లో ఒకరైన బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్ రెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ.. తమ స్థలం నుంచి కాలువ నిర్మాణం విషయమై జీహెచ్‌ఎంసీ అధికారుల నుంచే సరైన చర్యలు లేవన్నారు. తమకు నోటీసులు ఇవ్వడం గానీ, తమతో చర్చించడం గానీ జరగడం లేదన్నారు. కాలనీలు వరద ముంపు బారిన పడకుండా వరద కాలువ నిర్మాణానికి తమవంతు సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

అభివృద్ధి పనులకు భారీగా నిధులు

జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాధి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో కోట్లాది రూపాయల వ్యయంతో రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయని చైర్మన్ అబ్దుల్లా సాధి తెలిపారు. 3వ వార్డు పరిధిలోని వాదే జుబాన్ కాలనీలో రూ.62 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కౌన్సిలర్ అహ్మద్ కసాధితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, మంత్రి సబితారెడ్డి చొరవతో మున్సిపాలిటీ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారన్నారు. నబీల్ కాలనీ, డ్రీమ్ సిటీ కాలనీలలో రూ.10కోట్ల వ్యయంతో చేపడుతున్న ఎస్ఎన్‌డీపీ పనులు త్వరలోనే పూర్తి కానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యూనుస్ బిన్, జావిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న అబ్దుల్లా సాధి

మంత్రి సహకారంతో అన్నిరంగాల్లో అభివృద్ధి



పనులను ప్రారంభిస్తున్న మేయర్ దుర్గ, తదితరులు

మీర్‌పేట మేయర్ దుర్గ

మీర్‌పేట: మంత్రి సబితారెడ్డి సహకారంతో కార్పొరేషన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని మీర్‌పేట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ తెలిపారు. మీర్‌పేట ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా హెచ్‌ఎండీఏ నిధులు రూ.40లక్షలతో డివైడర్, రూ.85 లక్షలతో సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులను శుక్రవారం ప్రశాంతిహిల్స్ చౌరస్తాలో మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల అభివృద్ధికి కోసం మంత్రి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్, డీఈ గోపినాథ్, స్థానిక నాయకులు దోమలపల్లి రాజ్‌కుమార్, కార్పొరేటర్లు భిక్షపతిచారి, కీసర హరినాథ్‌రెడ్డి, భీంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి 'మహాజన్ సంపర్క్ అభియాన్'



సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరిన యువత

హయత్‌నగర్: ప్రధాని మోదీ ప్రధానిగా తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 30 నుంచి జూన్ 30 వరకు మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని.. కార్యక్రమ విజయవంతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని అర్బన్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం హయత్‌నగర్ డివిజన్‌లోని శాంతివనం టౌన్‌షిప్‌లో పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల రోజుల్లో మొత్తం తొమ్మిది కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ పిలుపునిచ్చిందని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే యోగా కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లాలన్నారు. జూన్ 21న నిర్వహించే యోగా డే సందర్భంగా ప్రతీ డివిజన్‌లోని బూత్ స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 23న శ్యాంప్రకాష్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని ఆయనకు నివాళి, 28న ప్రధాని మన్‌కీ బాత్ రేడియో ప్రసంగాన్ని స్థానికులు వినే ఏర్పాట్లుఉ, జూన్ 23 నుంచి 30 వరకు ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కాలనీకి చెందిన పలువురు యువకులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఉగాది ఎల్లప్ప, గోవిందాచారి తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం



దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న వీఓఏలు

సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజు

కందుకూరు: వీఓఏల తొమ్మిది డిమాండ్లను నెరవేర్చకుంటే ఈ నెల 29న సెర్ప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు, వీఓఏల సంఘం సీనియర్ నాయకులు సరస్వతి, శారద హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 40వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీఓఏల సమస్యలు పరిష్కారంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. వీఓఏలు న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తుంటే అధికారులు సమ్మె విరమించకపోతే వేరే వారిని పెట్టుకుంటామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఓ పక్క ఏపీఎంలకు రూ.90వేలు, సీసీలకు రూ.50వేల వరకు వేతనం ఇస్తూ వెట్టిచాకిరీ చేస్తున్న వీఓఏలకు మాత్రం నెలకు రూ.3,900 మాత్రమే చెల్లించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు పావని, బాలమణి, సంతోష, శశికళ, రమ్య, రజని, మాధవి, మంగ, పద్మ, పుష్పమ్మ, సంధ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న మహిళా కండక్టర్



బ్యాగును ప్రయాణికుడికి అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

హయత్‌నగర్: బస్సులో మరిచిపోయిన డబ్బుల బ్యాగును భద్రపర్చి ప్రయాణికుడికి అందజేసి తనలోని నిజాయితీని చాటుకుందో మహిళా కండక్టర్. హయత్‌నగర్ 1 బస్‌డిపో మేనేజర్ రఘు కథనం ప్రకారం... డిపోకు చెందిన మహిళా కండక్టర్ రాధిక శుక్రవారం ఉదయం హయత్‌నగర్–జేబీఎస్ రూట్‌లో (ఏపీ11 జెడ్7111) బస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. సన్‌షైన్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఏవీఎన్ రెడ్డి పనామా వద్ద బస్సు ఎక్కారు. తొందరలో ఆయన తన బ్యాగును బస్సులో మరిచిపోయి సికింద్రాబాద్‌లో దిగిపోయారు. బస్సు జేబీఎస్‌కు వెళ్లిందని తెలుకున్న ఏవీఎస్ రెడ్డి ఆటోలో అక్కడికి వెళ్లి ఆర్టీసీ అధికారుల సహకారంతో విషయాన్ని డిపో మేనేజర్ రఘు దృష్టికి తీసుకొచ్చారు. డీఎం కండక్టర్‌తో మాట్లాడి బ్యాగును హయత్‌నగర్ బస్ స్టేషన్ అధికారి శంకరయ్యకు అందజేయగా బ్యాగులో రూ.35 వేల నగదు, విలువైన డాక్యుమెంట్లు ఉన్నాయి. శంకరయ్య తమ సిబ్బందితో కలిసి బ్యాగును ప్రయాణికుడికి అందజేశారు. బ్యాగును భద్రపర్చి ప్రయాణికుడికి అందజేసిన కండక్టర్ రాధికను అందరూ అభినందించారు.

మహ్మద్ హాజీని ఆదుకుంటాం



మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో ఆర్థికసాయం అందజేస్తున్న ప్రశాంత్‌రెడ్డి

తలకొండపల్లి: మహ్మద్ హాజీకి ఆధునిక వైద్యం అందజేసి అన్ని విధాలుగా ఆదుకుంటామని సంఘసంస్కర్త, గ్రామ నాయకుడు నారెడ్డి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జూలపల్లి ఆడపడుచు అయిన నూరమ్మ భర్త మహ్మద్ హాజీ అనారోగ్యానికి గురయ్యారు. ప్రస్తుతం జూలపల్లిలోనే నివాసముంటున్నారు. మోకాలుకు సర్జరీ నిమిత్తం హాజీ మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీస్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. శుక్రవారం ప్రశాంత్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకున్నారు. హాజీ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నాడు. ఆధునిక వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. తక్షణ సాయంగా రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశాడు. అనతంరం ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ హాజీ చికిత్సకయ్యే హాస్పిటల్ ఖర్చులను భరిస్తానని భరోసా పలికారు. కార్యక్రమంలో వెంకటేశ్‌గౌడ్, శివ, తరుణ్, అరుణ్‌గౌడ్, కొండల్‌రెడ్డి, జగదీశ్‌గౌడ్, బైరమోని మధు, తదితరులు పాల్గొన్నారు.